సీజేఐకి సాదర వీడ్కోలు



విమానాశ్రయంలో సీజేఐకి కలంకారీ ఆర్ట్ అందజేస్తున్న కలెక్టర్

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌ఖన్నాకు విమానాశ్రయంలో సాదర వీడ్కోలు లభించింది. శ్రీవారి దర్శనార్థం శనివారం తిరుమలకు వచ్చిన ఆయన.. ఆదివారం మధ్యాహ్నం తిరుగు ప్రయాణమయ్యారు. విమానాశ్రయం వద్ద ఏపీ హైకోర్టు విజిలెన్స్ రిజిస్ట్రార్ శ్రీనివాస శివరాం, జిల్లా ఉమ్మడి డిస్ట్రిక్ట్ ప్రిన్సిపల్ జడ్జి ఇ.భీమారావు, తిరుపతి మూడవ అదనపు జడ్జి గురునాథ్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జేసీ శుభం బన్సాల్, జ్యుడిషియల్ ప్రొటోకాల్ సూపరింటెండెంట్ ధనుంజయనాయుడు సాదర వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.

- రేణిగుంట, ఆంధ్రజ్యోతి

సచివాలయాల్లోనే సరి

● నామమాత్రంగా టీడీఆర్ బాండ్ల పరిశీలన

టీడీఆర్ బాండ్ల జారీ స్పెషల్ డ్రైవ్ ఆదివారం కార్పొరేషన్ కార్యాలయంలో జరగలేదు. మాస్టర్ ప్లాన్ రోడ్ల పరిధిలోని కొన్ని సచివాలయాల్లో మాత్రమే నిర్వహించారు. అదీ ప్లానింగ్ సెక్రటరీల ద్వారా బాధితులనుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆదివారం సెలవైనా టీడీఆర్ బాండ్ల స్పెషల్ డ్రైవ్‌ను పెద్దఎత్తున నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ప్లానింగ్ అధికారులు చెప్పారు. దరఖాస్తుల పరిశీలన కోసం ఒక బృందం కార్యాలయంలో ఉంటే, మరో బృందం క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ సమాచారం తెలుసుకున్న పలువురు ఉదయం 10.30 గంటలకు కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకున్నారు. గంటపాటు వేచిచూశారు. ఇంతలో టౌన్‌ప్లానింగ్ కార్యదర్శులు అక్కడికి చేరుకుని వారిని ఆయా పరిధిలోని సచివాలయాలకు తీసుకెళ్లి డాక్యుమెంట్ల పరిశీలన చేశారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



సచివాలయంలో టీడీఆర్ బాండ్ల దరఖాస్తులను పరిశీలిస్తున్న ప్లానింగ్ కార్యదర్శులు



గిరీష్‌కుమార్‌కు చెందిన కారు

అమెరికా వెళ్లాల్సి ఉండగా..

- రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు తీవ్ర గాయాలు
- రెండు కార్లు ఢీకొన్న ఘటనలో గాయపడ్డ ఐదుగురు



చికిత్స పొందుతున్న మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): అమెరికా వెళ్లేందుకు ఇంటి నుంచి పయనమై మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితికి చేరుకున్నారు. రెండు కార్లు ఢీకొన్న ఈ ఘటనలో ఐదుగురు గాయపడిన ఘటన శ్రీకాళహస్తి శివారు వీఎంపల్లె వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగింది. శ్రీకాళహస్తి టూటౌన్ సీఐ వెంకటేష్ తెలిపిన ప్రకారం.. శ్రీకాళహస్తి మండలం అమ్మపాళెంకు చెందిన మధుసూదన్‌రెడ్డి(42) అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. సోమవారం ఉదయం చెన్నై విమానాశ్రయం నుంచి అమెరికా వెళ్లాలి. తన సోదరి కుటుంబాన్ని కలిసి సోమవారం విమానం ఎక్కేందుకని ఆదివారం నెల్లూరుకు కారులో బయలుదేరారు. ఇక, ఒంగోలుకు చెందిన కార్పెంటర్ ప్రభుదాస్ అల్లుడు గిరీష్ కుమార్ ఇటీవల సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. దీంతో శ్రీవారి దర్శనార్థం వీరు కుటుంబంతో కలిసి కారులో కారులో బయలుదేరారు. ఆదివారం మధ్యాహ్నం శ్రీకాళహస్తి సమీపం వీఎంపల్లె వద్దకు చేరుకున్నారు. అదే సమయంలో అమ్మపాళెం నుంచి నెల్లూరుకు వెళుతున్న మధుసూదన్‌రెడ్డి కారు టైరు పంక్చరవడంతో జాతీయ రహదారి డివైడర్‌ను దాటి అవతలివైపునకు దూసుకొచ్చి.. తిరుపతి వైపు వెళ్తున్న ప్రభుదాస్ కారును ఢీకొట్టింది.రెండు కార్లలోని క్షతగాత్రులను స్థానికులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మధుసూదన్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు కరకంబాడి వద్ద ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మరో కారులోని ప్రభుదాస్, అతడి కుమారుడు స్వామి, భార్య హర్షిత, అల్లుడు గిరీష్‌కుమార్, మరో బాలుడు సాయిరాఘవ శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గిరీష్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



దెబ్బతిన్న మధుసూదన్‌రెడ్డి కారు

ఇంకా ఎన్ని ఉన్నాయో?

- మూడు నెలలుగా హడలెత్తించి బోనుకు చిక్కిన చిరుత



ఇంకా ఎన్ని చిరుతలు ఉన్నాయ్?

...ఇదీ మూడు వర్సిటీల విద్యార్థులు, అటవీశాఖ అధికారులను వేధిస్తున్న ప్రశ్న. మూడు నెలలుగా హడలెత్తించిన చిరుత బోనుకు చిక్కడంతో ఒకవైపు ఊపిరి పీల్చుకున్నా.. మరోవైపు ఇంకా ఎన్ని ఉన్నాయనేది ఆందోళన కలిగిస్తోంది.

శేషాచల అటవీప్రాంతంలో ఎన్ని చిరుతల ఉన్నాయనే దానిపై అటవీశాఖ అధికారుల వద్ద ఇప్పటికీ ఖచ్చితమైన సమాచారం లేదు. ఏ ప్రాంతంలో ఎక్కువగా సంచరిస్తున్నాయనేదీ తేలడంలేదు. కానీ, చిరుతల సంఖ్య గణనీయంగా పెరిగిందనేది వాస్తవం. 40కిపైగా ఉండొచ్చన్న అంచనా తప్ప, స్పష్టమైన లెక్క లేదు. సాధారణంగా ప్రతి రెండేళ్లకోసారి చిరుతల గణన చేయాలి. అవి ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో కొంత మంది సిబ్బంది వాటి పాదముద్రలు, వెంట్రుకలు, మలం సేకరణతో పాటు ట్రాప్ కెమెరాల ద్వారా ఎన్ని చిరుతలు ఉన్నాయనే అంచనా వేస్తారు. ఈ క్రమంలో అటవీశాఖ అధికారులు శాంచరీ ఏరియాలోని తిరుమల, కరకంబాడి, మామండూరులో ఒక్కో బీట్‌లో పది చొప్పున 12 బీట్లలో 120 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. అంటే రిజర్వు ఫారెస్టులో కాకుండా అటవీప్రాంతం వెలుపలా చిరుతలు తిరిగే ప్రాంతాలను గుర్తించి వీటిని అమర్చారు. ఒక్కో కెమెరా మధ్య దూరం 100 మీటర్లు. మార్చినెల 10న ఏర్పాటు చేసిన ఈ కెమెరాలను ఈనెల 20వ తేదీ వరకు నిఘాలో ఉంచుతారు. ఆ తర్వాత వీటిని తీసి పరిశీలిస్తారు. ట్రాప్ కెమెరాలకు చిక్కిన చిరుతల ఆనవాళ్ల ఆధారంగా అవి ఎన్ని ఉన్నాయనే దానిపై ఒక అంచనాకు వస్తారు. ఈ కెమెరాలను శాంచరి ఏరియాలో మాత్రమే ఏర్పాటు చేయడంతో పూర్తిస్థాయిలో చిరుతల సంఖ్య తేలే అవకాశం లేదు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు చిరుతల గణనగురించి ఒక ప్రణాళికతో ముందుకు వెళితే తప్ప వాటి సంఖ్య తెలిసే అవకాశం లేదు.



వేదిక్ యూనివర్సిటీలోని బోనులో చిక్కిన చిరుతను పరిశీలిస్తున్న అధికారులు

అప్పుడప్పుడూ బోన్లుపెట్టి..

అటవీప్రాంతం నుంచి చిరుతలు సమీప ప్రాంతాల్లో శునకాలపై దాడి చేసినప్పుడు, ప్రజలు భయాందోళనకు గురైనప్పుడు తాత్కాలిక ఉపశమనంకోసం బోన్లను ఏర్పాటు చేస్తున్నారు. పట్టుబడ్డ వాటిని సుదూర ప్రాంతంలో వదిలేస్తున్నారు. ఇలా, తాజాగా ఎస్వీయూ, వెటర్నరీ, వేద వర్సిటీలు, క్వార్టర్స్‌లో ఉన్న వారికి మూడు నెలలుగా ఓ చిరుత కంటిమీద కునుకు లేకుండా వణికించింది. వర్సిటీలలో రాత్రి పూట సంచరిస్తూ పెంపుడు, వీధి కుక్కలు, జింకలపై దాడి చేస్తూ భయానక వాతావరణాన్ని సృష్టించింది.ఈ నేపథ్యంలో అటవీశాఖ అధికారులు ట్రాప్ కెమెరాలను, ఐదు బోన్లను ఏర్పాటు చేశారు. వేద వర్సిటీ శారదమ్మబిల్డింగ్ వద్ద ఏర్పాటు చేసిన బోన్‌లో ఆదివారం తెల్లవారుజామున ఓ చిరుత పట్టుబడింది. ఇది ఆడ చిరుతని అధికారులు తెలిపారు. చిరుతను పరిశీలించిన ఎస్వీ జూపార్కు డాక్టర్ అరుణ కుమార్ ఆరోగ్యంగా ఉందని చెప్పడంతో దీనిని అటవీశాఖ అధికారులు చిట్వేలు అటవీ ప్రాంతంలో వదలిపెట్టారు. ఇది ఈ ప్రాంత వాసులకు కొంత ఊరట కలిగినా ఇంకా ఎన్ని సంచరిస్తున్నాయనే ఆందోళనలో ఉన్నారు.

- మంగళం, ఆంధ్రజ్యోతి

ఇది సంతాన అభివృద్ధి సమయం

ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు చిరుతలు తమ సంతానాన్ని అభివృద్ధి చేసుకుంటాయి. ఈ సమయంలో తమ పిల్లలకు దూరంగా వెళ్లకుండా, ఆహారాన్ని సులభంగా వేటాడి తెచ్చుకునేలా అనువైన ప్రాంతాలను ఎంచుకుంటాయి. అటవీప్రాంతానికి ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో చిరుతలకు సులభంగా దొరికే శునకాలు, చిన్న చిన్న జీవాలపై దాడి చేస్తాయి వాటిని తమ పిల్లలకు ఆహారంగా తీసుకెళతాయి. ఈ లెక్కన గత కొంతకాలంగా చిరుతలు సంచరిస్తున్న ప్రాంతాలను పరిశీలిస్తే అటు వేద వర్సిటీ నుంచి ఎస్వీయూ, వెటర్న యూనివర్సిటీలు, వ్యవసాయ కళాశాల, నగరవనం, జీవకోన, తిమ్మినాయుడుపాలెం, మంగళం, కరకంబాడి ప్రాంతాల్లోను.. తిరుమల నడక మార్గంలోని ఏడో మైలు నుంచి నరసింహస్వామి ఆలయం వరకు చిరుతల సంచారం ఎక్కువగా ఉండటం గమనార్హం. నడక మార్గంలో చిన్నారులపై చిరుత దాడి ఘటనల తర్వాత ఏడో మైలు, నరసింహ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బోన్లలో ఐదు చిరుతలు పట్టుబడ్డాయి. గతంలో వెటర్నరీ వర్సిటీ వద్ద ఒకటి, మంగళం వద్ద ఒకటి బోన్లకు చిక్కాయి. ఇపుడు తాజాగా వేద వర్సిటీ వద్ద చిరుత బోనులో పడింది.

రామనామమే మధురంగా..!

- ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

సీతా లక్ష్మణ సమేత శ్రీరాముడికి స్నపన తిరుమంజనం





కోదండరాముడి దర్శనానికి బారులు తీరిన భక్తులు

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరామ నామం మధురం.. అంటూ జిల్లాలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఊరూరా రామమందిరాలు భక్తులతో సందడిగా మారాయి. తిరుపతిలోని కోదండరామ స్వామి ఆలయంలోని ఊంజల మండపంలో ఉదయం 8-9 గంటల మధ్య సీతారామ లక్ష్మణ సమేత హనుమంతుడి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పెద్దజీయర్ స్వామి మఠం నుంచి అర్చకులు నూతన వస్త్రాలను తీసుకొచ్చి మూలవర్లకు, ఉత్సవర్లకు సమర్పించారు. ఆ తర్వాత శ్రీరామ జన్మపురాణం, ఆస్థానం నిర్వహించారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు హనుమంతుడిపై కొలువుదీరిన శ్రీరామచంద్ర మూర్తి నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఇక, ఆలయంలో భక్తులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు నిరంతరాయంగా వడపప్పు, పానకం పంపిణీ చేశారు. ఆలయం లోపల భక్తులు రామకోటి రాశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



హనుమంత వాహనంపై ఊరేగుతున్న శ్రీరామచంద్రమూర్తి

నేడు 9గంటలకే పీజీఆర్ఎస్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌తో పాటు డివిజనల్, మండల కేంద్రాల్లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం ఉదయం 9గంటలకే ప్రారంభమవుతుందని కలెక్టర్ వెంకటేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులు హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



ఇంటర్ ప్రవేశాలకు వేళాయె

- పది ఫలితాలు రాకున్నా ప్రవేశం
- నేటి నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో దరఖాస్తుల ప్రక్రియ

జిల్లాలో ప్రభుత్వ
జూనియర్ కళాశాలలు: 21
ఎయిడెడ్ : 1
హైస్కూల్ ప్లస్ : 29
మొత్తం : 51

తిరుపతి(విద్య), ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): నూతన విద్యావిధానం అమల్లో భాగంగా ఈనెల ఒకటి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యాయి. ఈనెల 23 వరకు తరగతులు కొనసాగుతాయి. 24 నుంచి మే 30వ తేదీ వరకు వేసవి సెలవులు. జూన్ ఒకటిన కళాశాలలు పునఃప్రారంభం కానున్నాయి. సాధారణంగా పదోతరగతి పరీక్షల ఫలితాల అనంతరం ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలు ప్రారంభిస్తారు. పదవ తరగతి మూల్యాంకనం ఈనెల 3నుంచి 9వ తేదీ వరకు సాగుతుంది. ఆతర్వాతే ఫలితాలు వెలువడనున్నాయి. కానీ, సోమవారం నుంచే ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు జారీ చేస్తున్నారు. పదవ తరగతి ఫలితాలతో సంబంధం లేకుండా పాస్ అవుతామనే ధీమా ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

మధ్యాహ్న భోజనం వరం

మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ అమలుచేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం గ్రామీణ విద్యార్థులకు వరంలా మారింది. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం జూనియర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించగా.. గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు తగ్గుముఖం పట్టాయి. ఈ ఏడాది నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న నేపథ్యంలో ప్రవేశాలు పెరగవచ్చని ఇంటర్ బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సుమారు 10 వేల మంది విద్యార్థులు ఉన్నారు.

హాల్ టికెట్ జతచేసి దరఖాస్తు చేసుకోవాలి

ప్రభుత్వ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో, ఒత్తిడిలేని విద్యా బోధన ఉంటుంది. ఫీజుల భారం ఉండదు. మధ్యాహ్న భోజనం కూడా అందిస్తాం. పదో తరగతి ఫలితాలు రాకున్నప్పటికీ ఇంటర్‌లో చేరవచ్చు. పదోతరగతి పరీక్షల హాల్ టికెట్‌ను జత చేసి దరఖాస్తు చేసుకోవాలి.

- ప్రభాకర్‌రెడ్డి, ఆర్ఐవో, తిరుపతి జిల్లా

చంద్రగిరి

వైభవంగా ధ్వజారోహణం


గరుత్మంతుడి చిత్రపటాన్ని ఎగుర వేస్తున్న అర్చకులు


పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న సుధారెడ్డి

చంద్రగిరి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామాలయ వార్షిక బ్రహ్మోత్సవా లలో భాగంగా ఆదివారం ఉదయం ధ్వజారోహణం వైభవంగా నిర్వహించారు. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఉదయం 8 నుంచి 9 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజారోహణం ఘట్టాన్ని నిర్వహించారు. ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి, ధ్వజపటం, చక్రతాళ్వార్‌లకు తిరువీధి ఉత్సవం అనంతరం ధ్వజారోహణ కార్యక్రమాన్ని చేపట్టారు. గరుత్మంతుడి చిత్రంతో కూడిన ధ్వజపటానికి అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, భక్తుల రామనామస్మరణ మధ్య ధ్వజస్తంభంపైకి అధిష్ఠింపజేశారు. ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న ఆమెకు ఆలయాధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, సూపరింటెండెంట్ జ్ఞానప్రకాష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునిహరిబాబు, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడొద్దు


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నట్రైనీ ఐపీఎస్ హేమంత్

రామచంద్రాపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని ట్రైనీ ఐపీఎస్ హేమంత్ సూచించారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారితో పాటు అనుమానాస్పద వ్యక్తులకు ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీయిజం, దౌర్జన్యాలకు పాల్పడితే రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జనతా సేవామిత్ర హెల్పింగ్ హ్యాండ్స్ వార్షికోత్సవం



తిరుపతిరూరల్, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): వైకుంఠపురం ఆర్చ్ వద్ద ఉన్న జనతాసేవామిత్ర హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ 6వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వ్యవస్థాపకుడు కిరీటికృష్ణ, వైస్ ప్రెసిడెంట్ అయ్యంగారు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ రక్తదానం, అనాథ శవాలకు అంత్యక్రియలు, చెట్లు-జంతువుల సంరక్షణ, విద్య, వైద్యసాయం, అన్నదానం, అవయవదానంపై అవగాహన వంటి పలు సామాజిక సేవా కార్యక్రమాలను సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని వివరించారు. అనంతరం కేక్ కట్‌చేసి, సంఘ సభ్యులతో కలసి అలిపిరి శ్రీవారి మెట్ల వరకు బైక్ ర్యాలీగా వెళ్లి కొబ్బరి కాయలు కొట్టి మొక్కు చెల్లించారు.

డ్రైవింగ్, కంప్యూటర్, సెల్‌ఫోన్ రిపేర్‌పై శిక్షణ

చంద్రగిరి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ(ఆర్ఎస్ఈటీఐ) ఆధ్వర్యంలో నారావారిపల్లెలో ఈ నెల 18, 21తేదీల నుంచి లైట్ వెహికల్ మోటార్(ఎల్‌వీఎం), కంప్యూటర్, సెల్‌ఫోన్ రిపేర్‌లపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి లోకనాథం ఒక ప్రకటనలో తెలిపారు. లైట్ మోటార్ డ్రైవింగ్(కారు) శిక్షణకు 35 మందికి అవకాశం ఉంటుందని, దీనికి ఎనిమిదో తరగతి పాసై ఉండాలని, 19 నుంచి 45ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు. కంప్యూటర్ విభాగంలో డీటీపీ లేదా కంప్యూటర్ హార్డ్‌వేర్ నెట్ వర్కింగ్ కోర్సుకు 35 మందికి అవకాశం ఉంటుందని, పదో తరగతి చదివి ఉండాలని, 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలని వెల్లడించారు. ట్యాలీ కోర్సుకు ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ చదివి ఉండాలని, వయస్సు 19 నుంచి 45 సంవత్సరాల మధ్యలో ఉండాలని పేర్కొన్నారు. సెల్‌ఫోన్ రిపేర్‌కు 35 మందికి అవకాశం ఉంటుందని, పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్‌తో పాటు ఉచిత భోజన, రవాణా సౌకర్యం ఉంటుందని వివరించారు. ఉద్యోగావకాశాలు, స్వయం ఉపాధికి బ్యాంకు రుణాల మంజూరుకు సిఫారసు చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు డీఆర్డీఏ సీసీ గిరికుమార్ 9390504716, డీఆర్డీఏ ఏపీఎం గంగయ్య 9390504704, ఆర్సెటీ డైరెక్టర్ సురేష్‌బాబు 9494951289 లను సంప్రదించాలని కోరారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


చంద్రగిరిలో బీజేపీ జెండాను ఎగురవేస్తున్న నాయకులు

చంద్రగిరి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. జాతీయ రహదారి వద్ద బీజేపీ జెండాను ఎగురవేసి, స్వీట్లు పంచి పెట్టారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటముని మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని పేర్కొన్నారు. నాయకులు సుబ్రమణ్యం యాదవ్, ముని గంగిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, నరేష్‌కుమార్‌నాయుడు, దీనదయాళ్, దొరస్వామి, సునీల్‌కుమార్ యాదవ్, రమణ పాల్గొన్నారు.

పిందె, కాయ రాలకుండా నివారించాలి


రాలిన మామిడి పిందెలు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా ఈ ఏడాది మామిడిలో పిందెలు, కాయలు రాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ట్రైనింగ్ కోఆర్డినేటర్ మెరుగు భాస్కరయ్య అన్నారు. వాతావరణంలో వేడి పెరగడంతో పిందెలు రాలిపోతున్నాయన్నారు. పురుగు మందులు స్ప్రే చేయకుండా యాజమాన్య పద్ధతులతో నివారించవచ్చునని తెలిపారు. 15రోజులకు ఒకసారి నీరు పెట్టాలన్నారు. మామిడికాయలు ఎదిగే దశలో చెట్లకు పోషణ అందించాలని సూచించారు. కాయలు గోళి కాయ సైజులో ఉన్నప్పుడు పొటాషియం నైట్రేట్(13-0-45) లీటరుకు 10 గ్రాములు, యూరియా పది గ్రాములు, ఫార్ములా-4 2.5గ్రాములు కలిపి స్ప్రే చేస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు. కాయలు నాణ్యతగా ఉంటాయని తెలిపారు.

వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

రామచంద్రాపురం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రాయలచెరువుకట్ట భవానీ జలకంఠేశ్వరాలయంలో వెలసిన లక్ష్మీనారాయణ స్వామికి శాస్త్రోక్తంగా తిరుమంజనం జరిగింది. స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేపట్టి భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. గంగిరెడ్డి, రామాపురం, నడవలూరు, నెన్నూరు, కమ్మకండ్రిగ, పీవీపురం, బలిజపల్లె,మెట్టూరు, ఎన్ఆర్‌కమ్మపల్లె గ్రామా ల్లోని కోదండరామాలయంలో శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు.

వైభవంగా సీతారాముల కల్యాణం


భాకరాపేటలో నిర్వహిస్తున్న సీతారాముల కల్యాణం

భాకరాపేట, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట కోదండరామస్వామి ఆలయంలో ఉదయం స్వామి వారికి పంచామృత అభిషేకం, చందనాభిషేకం, మహామంగళహారతి నిర్వహించారు. అనంతరం కల్యాణం, విశేష పూజలు నిర్వహించారు. జంగాల సుబ్రహ్మణ్యం-మంజుల, సత్రాత పార్థసారథి-ప్రియాంక దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు.సాయంత్రం గరుడసేవ, గ్రామోత్సవం నిర్వహించారు.

తిరుచానూరులో..


పూజల్లో పాల్గొన్న భక్తులు

తిరుచానూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీరాముడి ఆలయంలో కిట్టప్ప స్వామి, ఆర్యవైశ్య నిత్యాన్నదాన సేవా సమాజం ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సతీష్ కుమార్, సతీష్, రవి, కల్యాణ్, తారక, ఇందిర, కుమారి, కుసుమ, కళావతి, రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో..


నృత్యం చేస్తున్న కళాకారులు

తిరుచానూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం శ్రీరామనవమిని పురస్కరించుకుని సాయంత్రం 5 గంటలకు వడపప్పు, పానకం పంపిణీ చేవారు. 6.30 గంటలకు పుత్తూరుకు చెందిన కేరళ నాట్య కళాలయం ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఆదివారం కావడంతో శిల్పారామం సందర్శకులతో నిండిపోయింది. ఏవో సుధాకర్ కళాకారులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

జిల్లా అభివృద్ధిపై రేపు సమీక్ష

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ వేదికగా మంగళవారం కలెక్టరు వెంకటేశ్వర్‌తో కలిసి ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ జిల్లా అభివృద్ధిపై అధికారులతో సమీక్షించనున్నారు. జరుగుతున్న పనులు, పెండింగ్ ప్రాజెక్టుల తదితరాలపై చర్చించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కూడా పాల్గొననున్నట్లు తెలిసింది.

భక్తులకు తాగునీరు



చంద్రగిరి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి జాతీయ రహదారిలోని నాగాలమ్మ ఆలయం వద్ద మల్లయ్యపల్లెకు చెందిన ప్రతాప్‌రెడ్డి శ్రీరామ నవమి సందర్భంగా భక్తుల కోసం తాగునీరు ఏర్పాటు చేశారు. వేసవిలో ప్రజలు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణం



తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు - కల్యాణోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు

చంద్రగిరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొటాల గ్రామంలో వెలసిన కోదండరామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం నిత్య, ప్రత్యేక పూజల అనంతరం సీతారామలక్ష్మణ సమేత హనుమంత ఉత్సవర్లకు అభిషేకం చేశారు. విశేషంగా అలంకరించి ఆలయం ముందు ప్రత్యేక వేదికపై కొలువుదీర్చారు. వెండితో తయారు చేసిన పాదుకలను ప్రతిష్ఠించారు. కల్యాణోత్సవంలో మాంగల్య ధారణ, కన్యాదానం, రామతారక మంత్ర హోమం, ఆశీర్వచనం అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. అన్నదానం చేశారు.

రూరల్‌లో శ్రీరామనవమి..

తిరుపతి రూరల్, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కేసీపేటలోని కోదండరామాలయం, చిగురువాడలోని ప్రసన్నాంజనేయస్వామి, వేణుగోపాలస్వామి, దుర్గసముద్రంలోని రామాలయం, అగ్రహారంలోని శ్రీరాములవారి ఆలయం, ఎంఆర్‌పల్లెలోని శ్రీరామ మందిరాలలో ఉదయం సీతారామసమేత లక్ష్మణస్వామివారి ఉత్సవమూర్తులు, చిత్రపటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు వడపప్పు, పానంకం పంచిపెట్టారు. పలు గ్రామాల్లో 11 రోజుల పాటు ఉభయాలు నిర్వహించనున్నారు. చివరిగా ఉట్లోత్సవం, వసంతాలు, కల్యాణోత్సవంతో ఈ ఉత్సవాలు ముగియనున్నాయి. తుమ్మలగుంటలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీరామ, సీతాదేవి ఉత్సవమూర్తుల ముంజేతులకు రక్షాబంధనాలను ధరింపజేసిన అర్చకులు శాస్త్రోక్తంగా వివాహతంతును జరిపించారు. ఆలయ వ్యవస్థాపకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించారు. తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.


→ తుమ్మలగుంటలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



పెద్దగోర్పాడు ఆలయంలో సీతారాముల కల్యాణం.. పాల్గొన్న గ్రామస్తులు

వైభవంగా సీతారాముల కల్యాణం

పాకాల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు రామాలయాల్లో ఆదివారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. పెద్దగోర్పాడు కోదండరామస్వామి ఆలయంలో అభిషేకం, అలంకరణ అనంతరం కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా కొలువుదీర్చి, వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలతో కల్యాణం చేశారు. రైల్వే కాలనీలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై స్వామివారి కల్యాణం జరిపించారు. భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. గోర్పాడు కోదండరామస్వామి ఆలయంలో ఉదయం డాక్టర్ మేడసాని మోహన్ శ్రీరామ వైభవం ప్రవచించారు. సాయంత్రం 4నుంచి 7 గంటల వరకు అన్నమాచార్య సంకీర్తనా గానం, రామాయణ హరికథ ఆకట్టుకున్నాయి. స్వామివార్ల ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగించారు.

వాడవాడలా నవమి ఉత్సవాలు


సీతారాముల ఊరేగింపు

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి); మండలంలోని అన్ని రామాలయాల్లో నవరాత్రి రామ భజనలు ప్రారంభమయ్యాయి. ఎర్రావారిపాలెం, నెరబైలు, ఉస్తికాయల పెంట, ఎల్లమంద, కోటకాడపల్లె, ఉదయమాణిక్యం, చింతగుంట, బోడేవాండ్లపల్లెలోని పెద్దరామాలయాల్లో పచ్చని పందిళ్లు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. 9 రోజుల పాటు చెక్క భజనలు, పండరి భజనలు, కోలాటలు రామకీర్తనలు నిర్వహించనున్నారు. కమళ్లయ్యగారిపల్లె పంచాయతీ తాటిమాకులపల్లెలో సీతారాముల ఊరేగింపు వైభవంగా జరిగింది.



కల్యాణం.. కమనీయం..

భద్రాద్రిలో వైభవంగా సీతారాముల పరిణయం

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

భక్తి పారవశ్యంలో సినీ నటి కొణిదెల నిహారిక


ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు


కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు


రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

జూపార్కు నిర్వహణలో నిర్లక్ష్యం

పెన్సింగ్ నేలకూలినా పట్టించుకోని వైనం

మంగళం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఆసియాలోనే అతి పెద్దదైన ఎస్వీ జూపార్కులో భద్రతా లోపం స్పష్టంగా కనిపిస్తోంది. నిర్వహణ లోపాలు విమర్శలకు తావిస్తున్నాయి. 2022 నవంబరులో కురిసిన భారీ వర్షాలకు జూపార్కు చుట్టూ రక్షణగా ప్రహరీ గోడ నిర్మించారు. ప్రవేశ మార్గానికి ఎడమవైపున ఉన్న గోడ కూలిపోయింది. దాని స్థానంలో అధికారులు పెన్సింగ్ వేసి ముళ్లకంపలను అడ్డుపెట్టి చేతులు దులుపుకున్నారు. ఏడాదిన్నర క్రితం ఈ పెన్సింగ్ పూర్తిగా నేలకొరిగింది. అడ్డుగా పెట్టిన ముళ్లకంపలు ఎప్పుడో తొలగిపోయాయి. జూపార్కులో కనిపించే వీధి శునకాలకు ఇది రాచమార్గంగా ఉంది. బయటి వ్యక్తులు లోపలకు వెళ్లాలన్నా, లోపల వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా ఏదన్నా బయటకు తరలించాలన్నా ఈ మార్గం ఉపయోగపడుతోంది. శేషాచల కొండల్లో సంచరించే చిరుతపులులు సైతం ఈ మార్గం గుండా లోపలకు ప్రవేశించడానికి అవకాశం ఉంటుంది. గతంలో జూపార్కు సిబ్బందిపై చిరుతలు దాడులు చేసిన ఘటనలున్నాయి. జింకల ఎన్‌క్లోజర్‌లోకి కూడా ప్రవేశించాయి. ఇన్ని అనర్థాలు జరుగుతున్నా జూపార్కు అధికారులు స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది.


ప్రహరీ కూలిన స్థానంలో ఏర్పాటు చేసిన పెన్సింగ్

కేంద్ర, రాష్ట్రాల్లో సుపరిపాలన

● హోంమంత్రి అనిత



ఆలయం ముందు హోంమంత్రి అనిత

తిరుమల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్రంలో రామరాజ్యం కొనసాగుతోందని, ప్రజలు సంతోషంగా ఉన్నారని హోంమంత్రి అనిత అన్నారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. శ్రీరామనవమి రోజున శ్రీవారిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. 2047 విజన్‌కు సీఎం చంద్రబాబు దీక్ష పూనారని, పీ4 విధానంలో బంగారు కుటుంబాలను అభివృద్ధిలోకి తీసుకురావాలని కంకణం కట్టుకున్నారని, ఎలాంటి ఇబ్బందులూ లేకుండా సక్రమంగా పూర్తికావాలని శ్రీవారిని కోరుకున్నానని చెప్పారు.

ఖైదీలకు ఉపాహారం వితరణ



తిరుపతి అర్బన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమిని పురస్కరించుకుని జేసీఐ, జేపీసీ అలుమిని క్లబ్ సంయుక్తంగా ఆదివారం ఉదయం కోర్టు ఆవరణలోని సబ్‌జైలు ఖైదీలకు ఉపాహారం వితరణ చేశారు. ముఖ్య అతిథిగా ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.ప్రవీణ్ పాల్గొని ఖైదీలకు పలు సూచనలు చేశారు. దాత ప్రకాష్, జైల్ సూపరింటిండెంట్ గురుశేఖర్‌రెడ్డి, జేసీఐ తిరుపతి అధ్యక్షుడు శేషసాయి, వైస్ చైర్మన్ జి.శంకర్, సోమయ్య, గుణశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ నవమి



అన్నదానం చేస్తున్న భానుప్రకాష్ రెడ్డి

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ ప్రాంతాల్లో కొలువైన లక్ష్మణ, ఆంజనేయ సమేత సీతారాముల ఆలయాల్లో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల మూలవర్లకు, ఉత్సవర్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. విశేష అలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. కేవీఆర్ జ్యువెలర్స్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, సనాతన ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు కిరణ్ కుమార్ పాల్గొన్నారు. పెద్దకాపు వీధిలోని రామ మందిరంలో భజన కార్యక్రమం చేపట్టారు. శివజ్యోతి నగర్‌లోని రామసాయి మందిరంలో ఉదయం 6 గంటలకు స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం, అలంకరణ, పూజలు నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు షిరిడి సాయిబాబాకు చందనోత్సవ సేవ నిర్వహించారు.

కోదండరాముడిని దర్శించుకున్న ఎస్పీ



తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదివారం కోదండరాముడిని దర్శించుకున్నారు. కోదండ రామాలయానికి చేరుకున్న ఆయన స్వామి వారి దర్శనానంతరం వీజీవోతో కలసి భద్రతపై సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా రామాలయాల వద్ద పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశామన్నారు.

మజ్జిగ పంపిణీ



తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రాముల వారి గుడి వీధిలోని పతంజలి ఆయుర్వేదిక్ చికిత్సాలయం ఆధ్వర్యంలో ఆదివారం భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. చికిత్సాలయం నిర్వాహకులు బత్తిని రవికుమార్ మాట్లాడుతూ ఏటా పతంజలి చికిత్సాలయం ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. ఎండా కాలం మజ్జిగ పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు.

నాదెండ్లకు జన సైనికుల వీడ్కోలు



నాదెండ్లకు ఎస్కే బాబు ఇచ్చిన చిత్రపటం

తిరుపతి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల పర్యటన నిమిత్తం తిరుపతికి వచ్చి ఆదివారం తిరుగుపయనమైన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు జనసేన నాయకులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విమానాశ్రయం వద్ద కార్పొరేటర్ ఎస్కే బాబు ఇచ్చిన చిత్రపటం అందరినీ ఆకర్షించింది. శ్రీరామనవమి రోజున పవన్, నాదెండ్ల మైత్రిని రామాంజనేయుల మైత్రితో పోల్చుతూ తయారు చేసిన చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వినోద్ రాయల్, శేషాద్రి పాల్గొన్నారు.

కోదండరాముడికి సైకం పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న సైకం జయచంద్రారెడ్డి

తిరుపతిరూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా తిరుపతి కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం సివిల్ సప్లైస్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ సైకం జయచంద్రారెడ్డి దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. సీతారామసమేతలక్ష్మణ, ఆంజనేయ స్వామివార్లకు పట్టువస్త్రాలను సమర్పించి మొక్కు చెల్లించారు. అర్చకులు, వాహనబేరర్లు, స్పీపర్లకు వస్త్రాలను కానుకగా అందించారు.

బీసీలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించాలి

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్‌తో బీసీ సమన్వయ కమిటీ, బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో బీసీ సమరభేరి చేపట్టినట్లు బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం బీసీ సమరభేరి పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జయచంద్ర, కేశవులు, రమణ, రోశయ్య, విజయ భాస్కర్ పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు కోసం చైతన్య యాత్ర

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దు చేసి, ఓపీఎస్ అమలు చేయాలని కోరుతూ మే 1న ఉద్యోగులు చైతన్యయాత్ర తల పెట్టినట్లు ఏపీ సీపీఎస్ ఈఏ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ చీర్ల కిరణ్ తెలిపారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ కూటమి నేతలు ఎన్నికల ముందు ఏడాదిలో సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పారని, ఈ సెప్టెంబర్‌తో ఆ గడువు పూర్తవుతుందని గుర్తు చేశారు. మే 1న కార్మిక దినోత్సవం సందర్భంగా ఉద్యోగుల చైతన్య యాత్ర పేరుతో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందిస్తామన్నారు. సెప్టెంబరు 1న అమరావతిలో పెన్షన్ మార్చ్ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పవన్, రేఖ, మురళి, ధరణి కుమార్, చలపతి, ఈశ్వర్, జగదీష్ పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



అన్నారావు సర్కిల్ వద్ద బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అన్నారావు కూడలి, బైరాగిపట్టెడ, ఎమ్మార్‌పల్లె, టౌన్‌క్లబ్, న్యూ ఇందిరానగర్, ఎల్‌బీసీ కాలనీ ప్రాంతాల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి, మండల నాయకుల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. పార్టీ జండాలు ఆవిష్కరించారు. పార్టీ సాధించిన విజయాలను గుర్తు చేసుకున్నారు. ఓంప్రకాష్ ఆధ్వర్యంలో సెంట్రల్ పార్క్ వద్ద అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు పొనగంటి భాస్కర్, వరప్రసాద్, జల్లి మధుసూదన్, పృథ్వీరెడ్డి, జీవన్ రాయల్, గవ్వల అశోక్, ప్రసాద్, చింతకాయల రవి, వెంకటరమణ పాల్గొన్నారు.

జన్మదినాన వేద పాఠశాలలో..



ఆలయం ముందు నాదెండ్ల మనోహర్

తిరుమల, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదివారం తన పుట్టినరోజు సందర్భంగా తిరుమలలోని ధర్మగిరి వేదపాఠశాలకు చేరుకుని శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్నారు. వేదపండితుల నుంచి ఆశీర్వాదం పొందిన ఆయన వేదవిద్యార్థులతో గడిపారు. అంతకుముందు కుటుంబ సమేతంగా ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తిరుమలలో మంత్రి నాదెండ్లను పలువురు జనసేన నేతలు కలిసి పట్టువస్త్రాన్ని కప్పి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. చంద్రగిరి ఇన్‌చార్జ్ దేవర మనోహర్, టీడీపీ నేత వెంకటస్వామి తదితరులు ఆయన్ను కలిశారు.

రుయా వద్ద అగ్నిప్రమాదం

కాలిన విద్యుత్ యూజీ కేబుల్



కాలిపోయిన 132 కేవీ విద్యుత్ కేబుల్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ సురేంద్ర నాయుడు

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అలిపిరి విద్యుత్ సెక్షన్ పరిధిలో రుయాస్పత్రికి విద్యుత్ సరఫరా చేస్తున్న మూడు 33 కేవీ విద్యుత్ కేబుల్స్ ఆదివారం అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. వాహనాల పార్కింగ్ గోడ వద్ద చెత్తను గుర్తు తెలియని వ్యక్తులు తగులబెట్టడంతో పక్కనే ఉన్న కేబుల్‌కు మంటలు అంటుకున్నాయి. చుట్టుపక్కల వారు అప్రమత్తమై మంటలను ఆర్పేశారు. విషయం తెలుసుకున్న తిరుపతి సర్కిల్ ఎస్ఈ పి.సురేంద్రనాయుడు డీఈఈలు ఆంజనేయులు, మునిప్రసాద్, భాస్కర్‌నాయుడు, ఏఈలు బాషా, ఉమాపతితో కలిసి అక్కడికి చేరుకున్నారు. గంట పాటు శ్రమించి ఆస్పత్రిలో రోగులకు, చుట్టుపక్కల ప్రాంతాల వారికి ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని ఈఈ చంద్రశేఖరరావు తెలిపారు. రూ.పది లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని చెప్పారు. కాలిన విద్యుత్ కేబుల్స్‌ను తొలగించి, మరమ్మతులు చేపట్టామని ఈఈ పుల్లా బాలాజీ తెలిపారు. ఆస్పత్రి ప్రాంగణంలో చెత్త ఎక్కడిపడితే అక్కడ పడేయడం వల్లే ఈ ఘటన జరిగిందని రోగుల బంధువులు ఆరోపించారు.

టీడీపీలో కష్టపడ్డ వారికి సముచితస్థానం

● ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కుమారమ్మ
● జీవకోనలో అభినందన ర్యాలీ
● టీడీపీలో చేరిన వైసీపీ యువత



వైసీపీ నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న నరసింహయాదవ్, సుగుణమ్మ, కుమారమ్మ

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడ్డ కార్యకర్తలకు సముచిత స్థానం లభిస్తుందని ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులైన కుమారమ్మ అన్నారు. కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రమాణస్వీకారం అనంతరం తిరుపతికి వచ్చిన ఆమె టీడీపీ నేతలో కలిసి ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుమారమ్మ మాట్లాడుతూ ఎస్సీలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రధాన కర్తవ్యమన్నారు.

టీడీపీలోకి వైసీపీ నేతలు

జీవకోనకు చెందిన వైసీపీ నేత వంశీ(జెట్లీ) తన అనుచర వర్గం 70 మందితో కుమారమ్మ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి పార్టీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, నియోజక వర్గ ఇన్‌ఛార్జి సుగుణమ్మ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, శాప్ చైర్మన్ రవినాయుడు, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధరవర్మ, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, పరసారత్నం, సూరా సుధాకర్ రెడ్డి, మహేష్‌యాదవ్, అన్నా రామచంద్రయ్య, అన్నా అనిత, అన్నా సంధ్య, పుష్పావతి, బీజీ కృష్ణయాదవ్, మునిశేఖర్, రాయల్, హేమంత్‌రాయల్, శ్రీనివాస్ యాదవ్, నాగరాజునాయుడు, తిరుమల నాయుడు, సుధాకర్, శ్రీరాములు, వెంకీ, రాణి, రవీంద్ర, రాంకీ, మురళి, శ్యామల, లక్ష్మి పాల్గొన్నారు.

రామాయణం జీవిత విలువలను తెలియజేస్తుంది

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రామాయణంలోని ఏడు కండాలు జీవిత విలువలను తెలియజేస్తాయని ఎస్వీడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణమ్మ పేర్కొన్నారు. శ్రీరామ నవమి సందర్భంగా అంతర్జాతీయ అంతర్జాల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. శ్రీపద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల తెలుగు విభాగం, సింగపూర్ తెలుగు సమాజం, మలేషియా తెలుగు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రామాయణ కావ్యంలోని ధర్మాలను లోకానికి తెలియజేయడం ప్రస్తుత కాలానికి ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో రామాయణ హరినాథరెడ్డి, డాక్టర్ వి.కృష్ణవేణి తదితరులు హాజరయ్యారు.

తానా పురస్కార గ్రహీతలకు సన్మానం



తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): తానా, మంచి పుస్తకం సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన నవలల పోటీల్లో ఆర్‌సీ కృష్ణస్వామి రాజు, పేట యుగంధర్ గెలుపొందారు. ఆదివారం వారిని తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో సత్కరించారు. కార్యక్రమంలో రచయితలు పల్లిపట్టు నాగరాజు, కేవీ మేఘనాథ్‌రెడ్డి, గిడ్డకింద మాణిక్యం పాల్గొన్నారు.

ముగిసిన శ్రీమద్రామాయణ ప్రవచనామృతం

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్, రామకృష్ణ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజుల పాటు సాగిన శ్రీమద్రామాయణ ప్రవచనామృత కార్యక్రమం ఆదివారం ముగిసింది. శ్రీమద్రామాయణం, శ్రీరామ నవమి ప్రాముఖ్యతను ప్రవచనకర్త డాక్టర్ ఆకెళ్ల విభీషణశర్మ ఉపన్యసించారు. టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, మిషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం

స్మగ్లర్ అరెస్టు



పట్టుబడ్డ స్మగ్లర్ అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటి-గడికోట మార్గంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు వాహనం సహా నాలుగు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్సు ఆర్ఎస్ఐ వినోద్‌కుమార్ బృందం శనివారం అన్నమయ్య జిల్లా రాజంపేట డివిజన్ సానిపాయ రేంజ్‌లోని వీరబల్లి ఫారెస్టు బీటు పరిధిలో కూంబింగ్ నిర్వహించింది. అనంతరం రాయచోటి-గడికోట మార్గంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. వేగంగా వస్తున్న కారును ఆపేందుకు ప్రయత్నించారు. ఆగకుండా వెళ్లడంతో వెంబడించారు. కారులో ఉన్న వ్యక్తి పారిపోయే ప్రయత్నం చేయగా అదుపులోకి తీసుకున్నారు. అందులో ఉన్న నాలుగు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని కారుతో సహా తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఏపీఎన్జీవోస్ భవనంలో ఆదివారం తిరుపతి ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసి యేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హరి, ప్రధాన కార్యదర్శిగా గోపి ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం అసోసియేషన్ విధి విధానాలు, సమస్యల పరిష్కార మార్గాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు హరిబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సందీప్‌రెడ్డి, కోశాధికారి అశోక్, కమిటీ సభ్యులు థామస్, సాంబశివరావు పాల్గొన్నారు.

కేంద్ర దర్యాప్తు సంస్థల అధికారుల దాడులు

● అదుపులో చాట్ దుకాణం నిర్వాహకుడు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర దర్యాప్తు సంస్థల అధికారులు నెల్లూరు కాపువీధికి చెందిన ఓ చాట్ దుకాణ నిర్వాహకుడిని ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. సెంట్రల్ ఎక్సైజ్ అధికారులా లేదా డీఆర్ఐ అధికారులా అనేది స్పష్టంగా తెలియదుగానీ ఆదివారం తిరుపతి జిల్లా గూడూరు సమీపంలో బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న సుమారు రెండు కేజీల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో అక్రమ రవాణాలో కాపువీధికి చెందిన ఓ చాట్ దుకాణ నిర్వాహకుడి ప్రమేయం ఉందని గుర్తించి అధికారులు ఆ వ్యాపారిని అదుపులోకి తీసుకున్నారు. అతడు పేరుకే చాట్ దుకాణం నిర్వహిస్తూ లోపల బంగారు వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తిరుపతిలో రౌడీల వీరంగం!

● పిల్లకే పరిమితమైన కౌన్సిలింగ్
● 'రాజకీయ' మద్దతు, పోలీసుల ఉదాసీన వైఖరితోనే చెలరేగుతున్నారంటూ విమర్శలు

● మూడు నెలల కిందట తిరుపతి చెన్నారెడ్డి కాలనీలోని పాత రౌడీషీటర్ ఒకరు అర్ధరాత్రి పైన పూటుగా మద్యం తాగాడు. అక్కడ భార్యాభర్తల గలాటాల్లో తలదూర్చి.. రాడ్‌తో భర్తను కొట్టి చంపాడు.

● రెండు నెలల కిందట ఎస్టీవీ నగర్‌కు చెందిన కొందరు యువకులు ద్విచక్ర వాహనాల్లో వచ్చి బైరాగిపట్టెడలో మద్యం తాగారు. అదే సమయంలో బైరాగిపట్టెడకు చెందిన మరో ఇద్దరు వారితో కలసి మద్యం తాగాక.. వారిపైనే రాళ్లు, కర్రలతో దాడులకు తెగబడ్డారు.

● తాజాగా అలిపిరి పరిధిలోని గరుడాద్రి నగర్, జీవకోనలోని రౌడీషీటర్లు వట్టికుంట అరుణ్‌కుమార్, భార్గవ్ రెచ్చిపోయి రూ.రెండు కోట్ల కోసం రాజేష్ కుటుంబాన్నే కిడ్నాప్ చేశారు.

ఇవి మచ్చుకు కొన్ని ఘటనలు మాత్రమే. తిరుపతి నగరంలో ఇలాంటి వారు మద్యం, గంజాయి మత్తులో వీరంగం చేస్తున్నారు. దీనికి పోలీసులు కఠిన వైఖరి అవలంభించకపోవడమే కారణమని తెలుస్తోంది. మరోవైపు వీరిలో కొందరికి రాజకీయ నేతలు మద్దతిస్తుండటంతో తామేమీ చేయలేకపోతున్నామని కొందరు పోలీసులు చెబుతుండటం గమనార్హం. ఇటీవల రోడ్డు మధ్యలో కారు ఆపి కొందరు మద్యం తాగుతుండగా.. పక్కకు తీస్తే వెళ్తామని మోటారు సైకిల్‌లోని ఓ వ్యక్తి చెప్పారు. అంతే వారిపై తిరగబడి కొట్టారు. వారిని పోలీసులు తీసుకొచ్చి విచారించగా ఓ ప్రజా ప్రతినిధి అండ వీరికి ఉందని తెలిసి వదిలిపెట్టినట్లు విమర్శలున్నాయి. ఇక, ఐదారు నెలల కిందట అలిపిరి పోలీసు స్టేషన్ వద్ద ఇద్దరు రౌడీలు ఏకంగా కానిస్టేబుళ్లపైనే తిరగబడి దాడి చేయగా, ఓ ఎస్ఐ వీరి వీపు విమానం మోత మోగించారు. వెంటనే ఓ ప్రజాప్రతినిధి నుంచి ఫోను రావడంతో బైండోవర్ కేసులు పెట్టి పంపారు.

ఈ వైఖరి వల్లే..

ఇలా.. రౌడీ షీటర్లకు కొందరు నాయకుల మద్దతు ఉండటం.. ఇక, రౌడీలు, చోటా మోటా గ్యాంగులను ప్రతి నెలా పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వడంతో పోలీసుల ఉదాసీన వైఖరివల్లే వీరంతా రోడ్లపైనే వీరంగం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పోలీసు యంత్రాంగం కఠిన వైఖరి అవలంబిస్తే కానీ వీరి నడవడికలో మార్పు కనిపించదు. ఈ దిశగా పోలీసు యంత్రాంగం దృష్టి పెట్టాల్సి ఉంది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి



భక్తులకు కొడిముద్దలు, వస్త్రదానం చేస్తున్న పండితులు

సంగమేశ్వరస్వామి ఆలయంలో ధ్వజారోహణం



ధ్వజస్తంభానికి కొడివస్త్రం కడుతున్న భక్తులు

కోట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలో గల కామాక్షీదేవి సమేత సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ధ్వజారోహణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కార్తికేశర్మ భక్తుల సమక్షంలో పురాతన ధ్వజస్తంభానికి కొడి వస్త్రాన్ని కట్టారు. స్వామివారి కొడి ముద్దలను భక్తులకు పంపిణీ చేశారు. మహిళా భక్తులకు పసుపు, కుంకుమ, రవికెలు పంపిణీ చేశారు.

చెన్నకేశ్వరస్వామి గ్రామోత్సవం



గంధంతో గ్రామోత్సవం జరుపుతున్న గ్రామస్తులు

కోట, ఏపిల్రల్ 6(ఆంధ్రజ్యోతి): కోట దళితవాడలోని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారి గంధోత్సవంతో గ్రామోత్సవం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల కల్యాణానికి ముందు ఊరేగించిన గంధంతో నలుగులు పెట్టి ముస్తాబు చేశారు.

శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల, ఏప్రిల్6 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 30 కంపార్టుమెంట్లలో సర్వదర్శన, వైకుంఠం క్యూకాంప్లెక్స్ 1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. శుక్రవారం హుండీ ఆదాయం రూ.3.60 కోట్లు లభించింది.

గిన్నిస్ బుక్ రికార్డు గ్రహీతకు సీఎం అభినందనలు

వెంకటగిరి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): యోగాలో గిన్నిస్ బుక్ రికార్డు సాధించిన వెంకటగిరికి చెందిన చింతగింజల వసంతలక్ష్మిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు. గతేడాది డిసెంబరులో 3.42 గంటల పాటు సమకోణాసనం వేసి వసంతలక్ష్మి గిన్నిస్ బుక్ రికార్డు సాధించారు. శనివారం అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వసంతలక్ష్మికి జ్ఞాపిక అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ నందం అబద్దయ్య, పద్మశాలి ఉద్యోగ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాళంగిలో స్నానానికి దిగి ఒకరి మృతి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ సమీపంలో ఉన్న కాళంగి నదిలోకి స్నానానికి వెళ్లి వెలుగోటి వెంకటేశ్వర్లు (41) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన వెంకటేశ్వర్లు ఆదివారం మధ్యాహ్నం ఎండవేడిమి నుంచి సేద తీరేందుకు కాళంగి నది వంతెన సమీపంలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లకూరు చర్చిలో చోరీ

పెళ్లకూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు ఎస్సీ కాలనీలోని చర్చిలో చోరీ జరిగింది. శనివారం రాత్రి దుండగులు చర్చిలోకి ప్రవేశించి ప్రార్థనకు ఉపయోగించే మైక్‌సెట్, డీజే బాక్సులను ఎత్తుకెళ్లారు.

ఉరుసు ఉత్సవాలు జయప్రదం

నాయుడుపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): హిందూ.. ముస్లింల ఐక్యతకు ప్రతీక అయిన హజరత్ అమీర్‌షావలి గంధోత్సవ ఉరుసు ఉత్సవాలు విజయవంగా నిర్వహించామని ఉరుసు కమిటీ అధ్యక్షుడు నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. దర్గా వద్ద ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు.

కమనీయం.. రాములోరి కల్యాణం





సీతారాముల మంగళసూత్రాన్ని చూపుతున్న వేదపండితులు - కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామనవమి వసంతోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం శ్రీరామనవమి పురష్కరించుకొని నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో కల్యాణ వేదిక ఏర్పాటు చేసి వేద మంత్రోచ్చరణ నడుమ సీతారాముల ఉత్సవ మూర్తులను ప్రదర్శనగా కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చి కొలువుదీర్చారు. అనంతరం ఉత్సవ మూర్తులు విశేషాలంకరణతో పెళ్లి పీటలపై ఆశీనులవగా వేదపండితులు కల్యాణ ఘట్టాన్ని జరిపించారు. నేత్రపర్వంగా సాగిన రాములోరి కల్యాణాన్ని భక్తులు కనులారా తిలకించారు. అశేష భక్తజనం నడుమ సీతారాముల శిరస్సుపై జీలకర్ర బెల్లం మిశ్రమాన్ని పెట్టారు. అనంతరం అభిజిత్ లగ్నంలో రామయ్య సీతమ్మ మెడలో మాంగళ్య ధారణ చేశారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి, తిరుమూరు సుధార్ రెడ్డి, ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, మాధవనాయుడు విచ్చేసి సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. అదే విధంగా బ్రాహ్మణ వీధిలో ఉన్న సీతారాముల ఆలయం, పార్కువీధిలోని మద్వేంకట రామ్మూర్తి స్వామి ఆలయాల్లో కూడా శ్రీరామనవమి వేడుకలను పురష్కరించుకొని సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కారంశెట్టి మల్లికార్జున, బీరక రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి గంగాప్రసాద్ కృషి ఎనలేనిది: పాశిం



కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గూడూరు డివిజన్‌లో టీడీపీ బలోపేతానికి ప్రముఖ పారిశ్రామికవేత కొండేపాటి గంగాప్రసాద్ చేస్తున్న కృషి ఎనలేనిదని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం కొండేపాటి గంగాప్రసాద్ పుట్టిరోజు సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ గంగాప్రసాద్ సహాయ సహకారాలతోనే తాను ఎమ్మెల్యేగా గెలిచానని, ఆయన చేసిన సాయాన్ని ఎన్నటికీ మరిచిపోలేనన్నారు. టీడీపీ కార్యకర్తలకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా గంగాప్రసాద్ అండగా నిలుస్తున్నారన్నారు. అనంతరం సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, వాటంబేడు శివకుమార్, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, రవీంద్రరెడ్డి, నాగసూరు గోపాల్‌రావు, అల్లీహుస్సేన్, భారతి, సుబ్బమ్మ, కల్పన, చరణ్, సునీల్, వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రేణిగుంటలోని అభయ క్షేత్రంలో గంగాప్రసాద్ పుట్టిరోజు సందర్భంగా టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు ఆరికట్ల మస్తాన్ నాయుడు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

వేడుకగా సీతారాముల నగరోత్సవం



నగరోత్సవ రథాన్ని లాగుతున్న నెలవల, తదితరులు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బజారువీధిలో వెలసిన రామమందిరంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని సీతారామ, లక్ష్మణులకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం సీతారామ, లక్ష్మణులను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి నగరోత్సవం నిర్వహించారు. ముందుగా చిదానంద మహారాజ్ కొబ్బరికాయ నగరోత్సవాన్ని ప్రారంభానికి ప్రారంభించారు. సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, నాయకులు, భక్తులు నగరోత్సవ రథాన్ని లాగారు. చాగణం సుమన్, రేష్మా దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈవో రవికృష్ణ, దూవా కామిరెడ్డి రాజారెడ్డి, రఫీ, నెలవల రాజేష్, బిరదవాడ శ్రీనివాసులు, గోపీ, సిద్దయ్య, దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, సుబ్బారావు, నారాయణ, రవి, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే బీజేపీ ధ్యేయం



గూడూరులో బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

గూడూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమమే బీజేపీ ధ్యేయమని ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు దయాకర్ అన్నారు. ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయంలో జెండా ఎగురవేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, శ్రీనివాసరావు, సురేష్ బాబు, నరేంద్ర, జీవీనాయుడు, బాలకృష్ణ, రవీంద్రబాబు, వెంకటేష్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: పట్టణంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తిరాల కిరణ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు వద్ద నుంచి రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న బీజేపీ కార్యాలయం వరకు మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి, కోటయ్య గౌడ్, వాసుకుమార్, శ్రీనివాసులు, బెజవాడ విజయమ్మ, నూతలపాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని పెన్నేపల్లి గ్రామంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు కలిచేటి నరసింహులు నాయకులు, కార్యకర్తలతో కలసి జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు గోగుతట్టు మురళి, మద్దాలి వీరయ్య, భరత్ కుమార్, రమణయ్య, నరసయ్య, పాపయ్య, కృష్ణ, లక్ష్మి, వరలక్ష్మి, బుజ్జమ్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం.. కమనీయం..

భద్రాద్రిలో వైభవంగా సీతారాముల పరిణయం

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

భక్తి పారవశ్యంలో సినీ నటి కొణిదెల నిహారిక



ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు



కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు



రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు





గూడూరులోని సాయిసత్సంగ నిలయంలో సీతారాముల కల్యాణం - పెళ్లకూరు మండలం జీలపాటూరులో సీతారాములకు పూజలు

వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

గూడూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఆలయాల్లో శ్రీరామనమి వేడుకలు వైభవంగా జరిగాయి. సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో విజయదుర్గాదేవికి నవావరణ హోమ పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో సీతారాములను ప్రత్యేకంగా అలంకరించి వేదపండితుల మంత్రోచరణల నడుమ కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపారు. అలాగే సాయిబాబా మందిరంలో సీతారాముల కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. అలాగే కోనేటిమిట్ట కోదండరామాంజనేయస్వామి ఆలయం, రాజావీధిలోని రామమందిరంలో శ్రీరామనమి వేడుకలు జరిగాయి.

చిల్లకూరు: మండలంలోని తమ్మినపట్నం గ్రామంలో వెలసిన కోదండ రామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. రాత్రికి సీతారాములను గజవాహ నంపై ఉంచి గ్రామోత్సవం జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సతీష్ యాదవ్, ఈవో గిరికృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు రెడ్డి, మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని జీలపాటూరు రామాలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు ప్రశాంత్‌శర్మ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. గ్రామానికి చెందిన శిరసనంబేటి మధుసూదనరెడ్డి భక్తులకు అన్నదానం చేశారు. అలాగే పెళ్లకూరు, కొత్తూరు, టెంకాయతోపు, చెంబేడు, చెన్నప్పనాయుడు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు.

తడ: మండలంలోని బోడిలింగాలపాడు వద్ద ఉన్న సీతారామాంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మొదట రుద్రాభిషేకం చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య సీతారాముల కల్యాణం వేడుకగా నిర్వహించారు. నిప్పో పరిశ్రమ యాజమాన్యం స్వామివార్లకు పట్టువస్త్రాలను సమర్పించింది. పరిశ్రమ ఎండీ ద్వారకనాథరెడ్డి సౌజన్యంతో 3వేల మందికి అన్నప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో నిప్పో పరిశ్రమ హెడ్ నాగరాజు, హెచ్‌ఆర్ రమేష్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని రాజగోపాలపురంలో వెలసిన లక్ష్మణ సమేత సీతారామాంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అలాగే బజారువీధి, శివాలయంవీధి, అగ్రహారపేట, తుమ్మూరులో ఉన్న రామమందిరాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

బాలాయపల్లి: మండలంలోని బాలాయపల్లి, వెంకటరెడ్డిపల్లి, నిండలి, జయంపు, అంబలపూడి, పిగిలాం గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు జరిగాయి. పూజలు నిర్వహించి భక్తులు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు.

కోట: మండల పరిధిలోని చిట్టేడు, శ్యామసుందరపురం, కోటలో శ్రీరామనవమి పర్వదినాన్ని గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. గోవిందపల్లెపాళెం మత్స్యకార గ్రామంలో సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. కొత్తపట్నం పంచాయతీలోని మత్స్యకార గ్రామాల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం నిర్వహించి గ్రామోత్సవం చేశారు.





చిల్లకూరు: మంగళసూత్రం చూపుతున్న వేదపండితులు - సీతారాముల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

ఎర్రచందనం దుంగల స్వాధీనం: ఒక స్మగ్లర్ అరెస్టు



పట్టుబడ్డ స్మగ్లర్ అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటి-గడికోట మార్గంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు వాహనం సహా నాలుగు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్సు ఆర్ఎస్ఐ వినోద్‌కుమార్ బృందం శనివారం అన్నమయ్య జిల్లా రాజంపేట డివిజన్ సానిపాయ రేంజ్‌లోని వీరబల్లి ఫారెస్టు బీటు పరిధిలో కూంబింగ్ నిర్వహించింది. అనంతరం రాయచోటి-గడికోట మార్గంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. వేగంగా వస్తున్న కారును ఆపేందుకు ప్రయత్నించారు. ఆగకుండా వెళ్లడంతో వెంబడించారు. కారులో ఉన్న వ్యక్తి పారిపోయే ప్రయత్నం చేయగా అదుపులోకి తీసుకున్నారు. అందులో ఉన్న నాలుగు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని కారుతో సహా తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

శాస్త్రోక్తంగా పెద్దకొట్టాయి ఉత్సవం



కోట మండపంలో విశేష అలంకరణలో స్వామిఅమ్మవార్లు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో పెద్దకొట్టాయి ఉత్సవాన్ని ఆదివారం రాత్రి శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వావసు నామ సంవత్సరం చైత్రశుద్ధ నవమిని పురస్కరించుకుని ఆదివారం ఈ ఉత్స వం జరిగింది. మొదట జ్ఞానప్రసూనాంబ సమేత ముక్కంటికి అలంకార మండపంలో విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా కోట మండపం వేంచేశారు. అక్కడ మూడు ప్రదక్షిణలు చేసి మండపం పక్కన కొలువుదీరారు. ఆలయ అర్చకులు స్వామిఅమ్మవార్లకు విశేష నైవేద్యం, మంత్రపుష్పం, దీపారాధన సమర్పించారు. ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల పల్లె నిద్ర



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి 1టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి పట్టణంలోని దర్గామిట్టలో పోలీసులు పల్లె నిద్ర చేశారు. ఇందులో భాగంగా ఆ ప్రాంత ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చట్టాలపై అవగాహన కల్పించారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ గోపి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయ కెమెరామెన్‌కు అస్వస్థత

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కెమెరామెన్‌గా పనిచేసే నాగరాజు అస్వస్థతకు గురయ్యాడు. ఆదివారం రాత్రి ఆలయంలో పెద్దకొట్టాయి ఉత్సవం వేడుకను వీడియో చిత్రీకరిస్తుండగా కోట మండపం వద్ద అస్వస్థతతో కళ్లు తిరిగి సొమ్మసిల్లిపోయాడు. ఆలయ అధికారులు అంబులెన్సులో చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ముక్కంటి ఆలయంలో కాలుజారిపడి...

కర్ణాటక భక్తుడికి తీవ్రగాయాలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కాలుజారి పడడంతో కర్ణాటకకు చెందిన భక్తుడు శంకరప్ప(65) తీవ్రంగా గాయపడ్డాడు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన శంకరప్ప కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని దర్శించుకున్నారు. ఆలయం నుంచి మూడవ గోపురం ద్వారా వెలుపలకు వస్తుండగా మెట్లపై కాలు జారడంతో శంకరప్ప కిందపడ్డాడు. గాయపడిన భక్తున్ని ఆలయ అధికారులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుడికాలు విరగడంతో పాటు భక్తుడి తలకు గాయమైంది. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు.

మద్యం మత్తులో యువకుల మధ్య ఘర్షణ

రేణిగుంట, ఏప్రిల్ 6, (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ సంఘటన ఆదివారం రాత్రి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఎదురుగా వంతెన కింద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... ఓ వర్గంలోని యువకుడిని మద్యం మత్తులో మరో వర్గం యువకులు దాడి చేశారు. దీంతో మరో వర్గంలోని యువకులు వంతెన వద్దకు చేరుకుని బాహాబాహీకి దిగారు. స్థానికులు భయభ్రాంతులకు గురై పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇద్దరు యువకుల్ని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించే క్రమంలో ఓ యువకుడు పరారయ్యాడు. అయితే పాత కక్షల కారణంగానే గొడవలు జరిగినట్టు తెలుస్తోంది.

ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీకి సాదర వీడ్కోలు



రేణిగుంట, ఏప్రిల్ 6, (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శక్తి కాంతదాస్‌కు విమానాశ్రయంలో సాదర వీడ్కోలు లభించింది. ఆదివారం ఉదయం శ్రీవారి దర్శనం అనంతరం రోడ్డు మార్గాన తిరుపతి విమానాశ్రయం చేరుకున్న ఆయనకు కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సాల్, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, తహసీల్దార్ సురేష్ బాబు సాదర వీడ్కోలు పలికారు.

మేకలను కరిచాయని కుక్కలకు విషం





మృత్యువాత పడిన కుక్కలు

రేణిగుంట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మేతకు వెళ్తున్న మేకలు, గొర్రెలను కుక్కలు కరిచాయని వాటిపై కోపం పెంచుకున్నాడు. ఆ కుక్కలకు విషం పెట్టి చంపాడో యువకుడు. ఆదివారం తెల్లవారు జామున మండలంలోని అన్నాస్వామిపల్లిలో ఈ ఘటన జరిగింది. స్థానికుల కథనం మేరకు... అన్నాస్వామిపల్లి నుంచి ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీకి వెళ్లే రోడ్డులో ఓ ఇంట్లో నివాసం ఉంటున్న యువకుడు మేకలు, గొర్రెలను మేపుతూ జీవినం సాగిస్తున్నాడు. వాటిని రోజు మేతకు తీసుకువెళ్లి తిరిగి తీసుకువచ్చేవాడు. ఇలా మేతకు వెళ్లి తీసుకువస్తున్న రెండు జీవాలపై శనివారం సాయంత్రం వీధి కుక్కలు దాడి చేశాయి. జీర్ణించుకోలేని ఆ యువకుడు ఆదివారం తెల్లవారుజామున ఏడు వీధి కుక్కలకు విషం కలిపి పెట్టడంతో తిని మృ త్యువాత పడ్డాయి. దీంతో యువకుడు తీరుపట్ల గ్రామంలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్టీఆర్ పార్కును సందర్శించిన ఎమ్మెల్యే



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్ పార్కును ఆదివారం ఎమ్మెల్యే సుధీర్ సందర్శించారు. అక్కడి ప్రజలతో మాట్లాడి వసతులపై ఆరా తీశారు. గత వైసీపీ ప్రభుత్వం పార్కును నిర్లక్ష్యం చేయడంతో దుస్థితికి చేరుకుందన్నారు. పరిశీలించి ఆహ్లాదకర వాతావరణం కల్పించామన్నారు. భద్రతను మరింత పటిష్ఠం చేయాలని అధికారులను ఆదేశించారు.

పుత్తూరు వార్తలు

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



పుత్తూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ సమీపంలో కొత్తగా నిర్మించిన జెండా దిమ్మె వద్ద మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు నిషిదరాజు, శ్రీధర్, మధు, శంకర్, భువనేశ్వరి తదితరుల ఆధ్వర్యంలో, స్థానిక శివాలయం వద్ద పార్టీ సీనియర్ నాయకుడు గుత్తా నారాయణస్వామి నాయుడు, బాబు, హరి, గంగయ్య, రాజయ్య ఆధ్వర్యంలో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. శివాలయం వద్ద అన్నదానం, ముగ్గురు సీనియర్లకు సన్మానం జరిగింది.

నేత్రపర్వం సీతారాముల కల్యాణం

పుత్తూరు టౌన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి) శ్రీరామ నవమి పురస్కరించుకుని ఆదివారం తడుకు పంచాయతీ తిమ్మరాజు కండ్రిగలో కొలువైన ఉన్న సీతారాముల ఆలయంలో కల్యాణోత్సవం అత్యంత కమనీయంగా సాగింది. భక్తులకు అక్షతలను పంచి పెట్టారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. అలాగే పుత్తూరు పట్టణంలోని కోదండరామ స్వామి కూడా నవమి వేడుకలు జరిగాయి.

అంబేడ్కర్ జయంతిని విజయవంతం చేద్దాం

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈనెల 14న అంబేడ్కర్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని అంబేడ్కర్ సొసైటీ సభ్యుడు కత్తి ధర్మయ్య కోరారు. ఆదివారం మండల కమిటీ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. గురువయ్య, దేవకుమార్, గురునాథం, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం... సీతారాముల కల్యాణం





తాళిబొట్టును చూపుతున్న అర్చకుడు - కల్యాణానికి హాజరైన భక్తులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలోని నెహ్రూవీధిలో ఉన్న పట్టాభి రామ మందిరంలో ఆదివారం రామనవమిని పురస్క రించుకుని సీతారాముల కల్యాణ మహోత్సవం భక్తుల కోలాహలం మధ్య కమనీయంగా జరిగింది. విశ్వావసు నామ సంవత్సరం చైత్రశుద్ధ నవమి తిథిని పురస్కరించుకుని ఉదయం అభిజిత్ శుభముహూర్తాన సీతారాముల కల్యాణం జరిగింది. ముక్కంటి ఆలయంనుంచి పట్టువస్త్రాలు సమర్పించారు. నెహ్రూవీధిలో బహిరంగ వేదిక ఏర్పాటు చేసి సీతారాముల కల్యాణ వేడుకలను నిర్వహించారు. స్వామిఅమ్మవార్లు విశేషాలంకరణలో పెళ్లి పీటలపై ఆసీనులయ్యారు. వేదపండితులు మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణ ఘట్టాన్ని పూర్తి చేశారు. ఆలయ అధికారుల అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఈవో బాపిరెడ్డి, చెంచయ్యనాయుడు, కోలా ఆనంద్, కోట వినుత, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.







నారాయణవనంలో స్వామిఅమ్మవార్ల ఊరేగింపు - పల్లమాల అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు - సత్యవేడులో స్వామిఅమ్మవార్ల కల్యాణం

వాడవాడలా శ్రీరామనవమి వేడుకలు

నారాయణవనం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొలువై ఉన్న కల్యాణ వెంకన్న ఆలయంలో శ్రీరామనవమి వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నిత్యా పూజా కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు సీతా లక్ష్మణ సమేత కోదండ రామస్వామి వార్లకు పాలు, పెరుగు, నెయ్యి, కొబ్బరి నీరు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పుష్పాలతో అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్ఠింపజేసి గ్రామంలో ఊరేగించారు. ఆలయాధికారి నాగరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పెద్దపాండూరు కోదండ రామాలయంలో జరిగిన పూజల్లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త పరంధామరెడ్డి, యుగంధర్‌రెడ్డి, దశరథన్, దశరథయ్య, నందకిషోర్‌రెడ్డి, జయశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): మండలంలో శ్రీరామనవమి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పల్లమాలలోని అభయాంజనేయ ఆలయంలో, గాజుల పెళ్లూరు, బుచ్చినాయుడుకండ్రిగల్లోని ఆలయాల్లో వడపప్పు, పానకాన్ని పంపిణీ చేశారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి ఇంట రామనవమిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నవమి వేడుకల్లో భాగంగా మొదటి రోజు ఆదివారం కాయోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైదేహి కల్యాణ మండప ఆవరణలో ఉన్న కోదండ రామస్వామి ఆలయంలో ఆదివారం రామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని దేవతామూర్తులను వివిధ పుష్పాలు, నగలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీరాముడు, సీతమ్మ వారిని వివాహ వేదికపై ప్రతిష్ఠింపజేసి అర్చక బృందం ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఈ ఘట్టాన్ని భక్తులు తన్మయత్వంతో వీక్షించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): నవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని జానకిరామాలయంలో స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద ఎత్తున రాముల వారి సాయిబాబా మందిరం ఆవరణలో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

శ్రీకాళహస్తి (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పద్మశాలిపేటలో ఉన్న రామాలయంలో ఆదివారం విశేషపూజలు నిర్వహించారు. సీతారాములు, లక్ష్మణమూర్తులను స్వర్ణతాపడ కవచాలతో అలంకరించారు.

దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం





శ్రీకాళహస్తి, పిచ్చాటూరుల్లో జరిగిన ఆవిర్భావ దినోత్సవాలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ సోము వీర్రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భేరివారి మండపం కూడలిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నాలుగు మాడ వీధుల మీదుగా రామసేతు వంతెన, పంచాయతీరాజ్ అతిథిగృహం వరకు ర్యాలీ జరిగింది. రామ నవమిని పురస్కరించుకుని ఎమ్మెల్సీ సోము వీర్రాజు భక్తులకు పానకం, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేశాభివృద్ధి కోసం, ప్రజా సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎమ్మెల్సీ సోము వీర్రాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు, పార్టీ మాజీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, నాయకులు మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, కండ్రిగ ఉమ, శైలజ, ఉమాసింగ్, గోపాల్, ఎస్వీరమణ, ప్రజ్ఞశ్రీ, అమర్‌నాథ్, డిల్లీకుమార్, సుకుమార్ పాల్గొన్నారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రప్ప హాజరై జెండాను ఆవిష్కరించారు. పార్టీ మండల అధ్యక్షుడు దిలీప్‌రాయల్, నాయకులు సిద్ధులయ్య, సుబ్బరత్నమ్మ, భాస్కర్‌రెడ్డి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.


కేవీబీపురం(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాలను పార్టీ మండల అధ్యక్షుడు బాబుయాదవ్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య, మునిశేఖర్‌యాదవ్, వెంకటకృష్ణయ్య, శ్యామ్, టీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆనందనాయుడు ఆధ్వర్యంలో గాంధీనగర్ సర్కిల్ కూడలిలో జెండాను ఆవిష్కరించి నిర్వహించారు. పురుషోత్తంరెడ్డి, మునిరత్నం, మహేశ్వర్‌రాజు పాల్గొన్నారు.

సత్యవేడు(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాలను ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.బాలాజి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా క్లాక్‌టవర్ వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి, మిఠాయిలు పంచి పెట్టారు. ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మునికృష్ణయ్య, బండారు మోహన్‌బాబు, వెంకటేశులు రెడ్డి, వెంకటేశ్వర్లు, నరేంద్ర, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేఎల్‌ఎం హాస్పిటల్ కూడలిలో బీసీ కార్పొరేషన్ సభ్యురాలు తేజవతి ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అన్నదానం చేశారు. కిసాన్ మోర్చా నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రమణారెడ్డి, కృష్ణారెడ్డి, వేణు, ఇందుకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి మనోహర్‌ను కలిసిన రూపేష్



సత్యవేడు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జనసేన పీఏసీ చైర్మన్, మంత్రి మనోహర్‌ను సత్యవేడు జనసేన మండల అధ్యక్షుడు రూపేష్ కుమార్ ఆదివారం తిరుమలలో కలిశారు. మనోహర్‌ను ఆయన జన్మదినం సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

గంగాప్రసాద్ పుట్టినరోజు వేడుకలు

కేవీబీపురం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో పారిశ్రామికవేత్త, టీడీపీ సీనియర్ నేత గంగాప్రసాద్ జన్మదిన వేడుకలను సత్యవేడు నియోజకవర్గ టీడీపీ అబ్జర్వర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులునాయుడు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మునస్వామియాదవ్, తిరుపతి పార్లమెంటు తెలుగురైతు అధ్యక్షుడు గోపీనాథరెడ్డి, సర్పంచ్ బాలాజి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు గంగాప్రసాద్ జన్మదిన వేడుకలను జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కన్నయ్యనాయుడు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రవినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు.

నారాయణవనం (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు గంగాప్రసాద్ జన్మదిన వేడుకలను ఆదివారం నారాయణవనం మండలంలో సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, జడ్పీటీసీ సభ్యులు సుమన్‌కుమార్ ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఉదయం దుండి వినాయక స్వామి ఆలయంలో గంగాప్రసాద్ పేరిట అర్చనలు చేయించారు. మాజీ ఎంపీపీలు గోవిందస్వామి, ఏపీ భక్తవత్సలం, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, సర్పంచ్ కేజీ శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత గంగాప్రసాద్ జన్మదిన వేడుకలను సత్యవేడు క్లాక్ టవర్ వద్ద ఆ పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీపతిబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

నేడు రక్తదాన శిబిరం

పిచ్చాటూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద తిరుపతి రుయా ఆస్పత్రి వైద్యుల పర్యవేక్షణలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్ రెడ్డి చెప్పారు. ఈనెల 7న సోమవారం ఎమ్మెల్యే ఆదిమూలం జన్మదినం సందర్భంగా శిబిరం నిర్వహిస్తున్నాట్టు చెప్పారు. ఉదయం 9.30 శిబిరం ప్రారంభమవుతుందని చెప్పారు. 10.30 గంటలకు ఎమ్మెల్యే ఆదిమూలం ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ కేక్ కటింగ్ చేసి అన్నదానం చేస్తున్నట్టు చెప్పారు.

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న కోట వినుత

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆదివారం శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి కోట ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అదే విధంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో భక్తులకు పానకం, వడపప్పు, మజ్జిగ వంటివి వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పేట చంద్రశేకర్, కావలి శివకుమార్, చిరంజీవి, రాజ్యలక్ష్మి, లక్ష్మి, దుమ్ము రాయల్, శారద, గాయత్రి, లక్ష్మణ్, దినేష్, ఉదయ్, వెంకటరమణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నాదెండ్లకు ఘనస్వాగతం



మంత్రికి వరి కంకులతో స్వాగతం పలుకుతున్న జనసేన నాయకులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తిరుపతి పర్యటన నిమిత్తం ఆదివారం తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయన్ను శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి కోట మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు ముక్కంటి ప్రసాదాలను అందజేశారు. రైతులు, మహిళలు ఆయనకు వినూత్నంగా వరి కంకులతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, భాగ్యలక్ష్మి, శివకుమార్, పేట చంద్రశేఖర్, దీనదయాల్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయ మహాకుంభాభిషేకం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేట గాండ్లవీధిలో గాండ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన సీతా సమేత రామచంద్రస్వామి ఆలయ మహా కుంభాభిషేకం, నూతన చిత్రపట ప్రతిష్ఠాపన కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ కమిటీ సభ్యులు బాలిశెట్టి విజయశేఖర్, రాజేంద్ర, సురేష్ తదితరులు పాల్గొన్నారు.